అండర్-19 వరల్డ్‌కప్
**సెమీఫైనల్ నేడు**
భారత్ X దక్షిణాఫ్రికా
మధ్యాహ్నం 1.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో

1 టెస్టుల్లో ఇంగ్లండ్‌పై ఎక్కువ వికెట్లు (97) తీసిన భారత బౌలర్‌గా అశ్విన్.

టెస్టుల్లో తన రెండో ఉత్తమ గణాంకాలు (9/91) నమోదు చేసిన బుమ్రా. అలాగే భారత్ నుంచి మాజీ పేసర్ చేతన్ శర్మ (10 వికెట్లు) తర్వాత ఇంగ్లండ్‌పై ఇదే బెస్ట్ షో.

2 భారత్‌లో నాలుగో ఇన్నింగ్స్‌లో రెండో అత్యధిక స్కోరు (292) చేసిన జట్టుగా ఇంగ్లండ్. శ్రీలంక (299/5) టాప్‌లో ఉంది.

1 1996లో సచిన్, గంగూలీ తర్వాత 25 ఏళ్లలోపున్న ఇద్దరు భారత బ్యాటర్లు (జైస్వాల్, గిల్) ఒకే టెస్టులో సెంచరీలు చేయడం ఇదే తొలిసారి.


అశ్విన్

# విశాఖలో విజయభేరి

రెండో టెస్టులో 106 రన్స్‌తో భారత్ భారీ గెలుపు

- ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్ 292 ఆలౌట్
- బుమ్రా, అశ్విన్ విజృంభణ

**సంచలనమేమీ లేదు.. ఇంగ్లండ్ బజ్‌బాల్ గేమ్‌కు భారత బౌలర్లు సమర్థవంతంగా చెక్ పెట్టారు. ఆటకు ఇంకా రెండు రోజుల సమయం ఉండగా, 399 పరుగుల లక్ష్యాన్ని స్టోక్స్ సేన దూకుడుగా ఛేదిస్తుందేమోనని అనుకున్నా.. పేసర్ బుమ్రా, స్పిన్నర్ అశ్విన్ వారి ఆటలను సాగనివ్వలేదు. ఛేదన ఎంతైనా 60-70 ఓవర్లలోనే ముగిస్తామని ప్రగల్భాలు పలికిన పర్యాటక జట్టును రెండు సెషన్లలోపే భారత్ ప్యాకప్ చేసింది. ఫలితంగా.. ఐదు టెస్టుల సిరీస్‌ను టీమిండియా ప్రస్తుతానికి 1-1తో సమం చేసింది.**



## యువ ఆటగాళ్లు భేష్

'ఇంగ్లండ్‌లాంటి పటిష్ట జట్టుపై యువ ఆటగాళ్లు చూపిన ప్రతిభ అమోఘం. వారిని చూస్తే గర్వంగా ఉంది. అయితే తమ స్కోర్లను భారీగా మల్చుకోలేకపోయారు. టెస్టులకు కొత్త కావడంతో అనుభవం ద్వారా ఆ లోటును భర్తీ చేస్తారని భావిస్తున్నాం. వారిలో ఆత్మవిశ్వాసాన్ని కలిగిస్తూనే, ఒత్తిడి లేకుండా స్వేచ్ఛగా ఆడనీయడం ముఖ్యం. బుమ్రా ఓ చాంపియన్ ప్లేయర్.'

\- రోహిత్

## గిల్ ఓకే..

రెండో రోజు ఆటలో ఫీల్డింగ్ చేసేటప్పుడు గిల్ కుడిచేతి చూపుడు వేలికి గాయమైంది. దీంతో అతను సోమవారం పెవిలియన్‌కే పరిమితమయ్యాడు. అలాగే గిల్‌కు చేసిన స్కానింగ్‌లో పెద్దగా ఆందోళనపడాల్సిన అవసరం లేదని, మరికొద్ది రోజుల్లో అతను పూర్తిగా కోలుకోనున్నట్టు తేలింది.

## అబుధాబికి ఇంగ్లండ్ జట్టు

భారత్‌తో రాజ్‌కోట్‌లో జరిగే మూడో టెస్ట్‌కు పది రోజులు సమయం ఉండడంతో..ఇంగ్లండ్ జట్టు అబుధాబి వెళ్లనుంది. భారత్ పర్యటనకు ముందు ఆ జట్టు అక్కడే శిబిరంలో పాల్గొంది. ఈనెల 15న మూడో టెస్టు మొదలవనుండడంతో..అప్పటివరకు అబుధాబి వెళ్లి స్టోక్స్ సేన విశ్రాంతి తీసుకోనుంది.

**విశాఖపట్నం (స్పోర్ట్స్):** ఇంగ్లండ్ చేతిలో ఎదురైన తొలి టెస్టు పరాజయానికి భారత జట్టు గట్టిగానే బదులిచ్చింది. తమపై పెట్టుకున్న అంచనాలను నిజం చేస్తూ బౌలర్లు సమష్టిగా రాణించారు. తద్వారా ఆటకు నాలుగోరోజైన సోమవారమే ముగిసిన రెండో టెస్టులో 106 పరుగుల తేడాతో భారత్ ఘనవిజయం సాధించింది. అటు తగిన సమయం ఉన్నప్పటికీ ఇంగ్లండ్ వేగంగా ఆడే ప్రయత్నంలో వికెట్లను చేజార్చుకుని మూల్యం చెల్లించుకుంది. 399 పరుగుల ఛేదనలో ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో 69.2 ఓవర్లలో 292 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ క్రాలే (73), బెన్ ఫోక్స్ (36), హార్ట్‌లీ (36) మాత్రమే ఆకట్టుకున్నారు. బుమ్రా, అశ్విన్‌కు మూడేసి వికెట్లు దక్కాయి. ఓవరాల్‌గా 9 వికెట్లతో రాణించిన బుమ్రాకు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ దక్కింది. ఈ ఫలితంతో ఐదు టెస్టుల సిరీస్‌లో భారత్ 1-1తో నిలిచింది. మూడో టెస్టు ఈనెల 15 నుంచి రాజ్‌కోట్‌లో జరుగుతుంది.


మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ట్రోఫీతో బుమ్రా

**తొలి సెషన్‌లోనే ఖాయమైంది:** ఓవర్‌నైట్ స్కోరు 67/1తో ఇంగ్లండ్ తొలి సెషన్‌ను ఆరంభించింది. మరో 332 పరుగులు కావాల్సిన వేళ.. భారత బౌలర్లపై ఎదురుదాడికి దిగిన ఇంగ్లండ్ బ్యాటర్లు సెషన్ ముగిసేసరికి 127 పరుగులు జత చేశారు. కానీ ఈ క్రమంలో ఏకంగా ఐదు వికెట్లు కోల్పోవడంతో మ్యాచ్ ఫలితం ఎలా ఉండబోతోందో అవగతమైంది. స్పిన్ త్రయం కుల్దీప్, అశ్విన్, అక్షర్ మిడిలార్డర్‌ను ఇబ్బందిపెట్టారు. తొలి టెస్టులో స్పిన్‌ను రివర్స్ స్వీప్‌తో ఎదుర్కొన్న ప్రత్యర్థి వ్యూహం ఈసారి పనిచేయలేదు. అయితే క్రాలే మాత్రం దూకుడుగా వెళ్లాడు. ఆరంభంలో ఫోర్లతో ఆకట్టుకున్న రెహాన్ అహ్మద్ (23)ను తొలి గంటలోపే అక్షర్ అవుట్ చేయడంతో రెండో వికెట్‌కు 45 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అటు పోప్ (23) కూడా ఎక్కువ సేపు క్రీజులో నిలవలేకపోయాడు. అశ్విన్ ఓవర్‌లో స్లిప్‌లో అతడిచ్చిన క్యాచ్‌ను రోహిత్ మెరుపు వేగంతో అందుకున్నాడు. అశ్విన్ బౌలింగ్‌లోనే జో రూట్ (16) అనవసర షాట్‌కు వికెట్ చేజార్చుకున్నాడు. అయితే క్రాలేకు జతగా బెయిర్‌స్టో (26) క్రీజులో ఉండడంతో అప్పటికీ ఇంగ్లండ్ విజయంపై ఆశలు కోల్పోలేదు. కానీ అర్ధసెంచరీతో ఊపు మీదున్న క్రాలేను కుల్దీప్, బెయిర్‌స్టోను బుమ్రా వరుస ఓవర్లలో అవుట్ చేయడంతో ఇంగ్లండ్‌కు గట్టి దెబ్బ తగిలింది.

**చివర్లో పోరాటం:** రెండో సెషన్‌ను కెప్టెన్ స్టోక్స్ (11), ఫోక్స్ ఆరంభించడంతో అప్పటికీ ప్రమాదం లేకపోలేదనిపించింది. అత్యంత గడ్డు పరిస్థితిల్లోనూ ఒంటిచేత్తో మ్యాచ్‌లను గెలిపించిన అనుభవం స్టోక్స్‌కు ఉంది. కానీ, ఈసారి అతను చేజేతులా వికెట్‌ను సమర్పించుకుని భారత్‌ను సంబరాల్లో ముంచాడు. అశ్విన్ ఓవర్‌లో ఫోక్స్ సింగిల్ కోసం పరిగెత్తాడు. అటు నుంచి స్టోక్స్ కాస్త బద్ధకంగా కదలడంతో మిడ్ వికెట్‌లో బంతిని అందుకున్న శ్రేయాస్ మెరుపు వేగంతో వేసిన త్రోకు వికెట్లు నేలకూలాయి. అప్పటికి స్టోక్స్ బ్యాట్ వెంట్రుకవాసి తేడాతో క్రీజుకు దూరంగా ఉండడంతో రనౌట్ కాకతప్పలేదు. ఈ దశలో ఫోక్స్, హార్ట్‌లీ పోరాడారు. ఇద్దరూ స్పిన్నర్ల ఓవర్లలో చెరో సిక్సర్‌తో వేగం పెంచేందుకు చూశారు. అలాగే అడపాదడపా ఫోర్లతో ఆకట్టుకుంటూ ఎనిమిదో వికెట్‌కు 55 పరుగులు జోడించారు. ఫోక్స్‌ను రిటర్న్ క్యాచ్‌తో బుమ్రా అవుట్ చేయడంతో ఇంగ్లండ్ ఆశలు అడుగంటాయి. మరో ఐదు ఓవర్లలో చివరి రెండు వికెట్లు కూడా నేలకూలడంతో ఇంగ్లండ్ ఓటమి పాలైంది.

### స్కోరుబోర్డు

**భారత్ తొలి ఇన్నింగ్స్: 396; ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 253; భారత్ రెండో ఇన్నింగ్స్: 255**

**ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్:** క్రాలే (ఎల్బీ) కుల్దీప్ 73; డకెట్ (సి) భరత్ (బి) అశ్విన్ 28; రెహాన్ (ఎల్బీ) అక్షర్ 23; పోప్ (సి) రోహిత్ (బి) అశ్విన్ 23; రూట్ (సి) అక్షర్ (బి) అశ్విన్ 16; బెయిర్‌స్టో (ఎల్బీ) బుమ్రా 26; స్టోక్స్ (రనౌట్) 11; ఫోక్స్ (సి అండ్ బి) బుమ్రా 36; హార్ట్‌లీ (బి) బుమ్రా 36; బషీర్ (సి) భరత్ (బి) ముకేశ్ 0; అండర్సన్ (నాటౌట్) 5; **ఎక్స్‌ట్రాలు: 15; మొత్తం: 69.2 ఓవర్లలో 292 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-50, 2-95, 3-132, 4-154, 5-194, 6-194, 7-220, 8-275, 9-281, 10-292. **బౌలింగ్:** బుమ్రా 17.2-4-46-3; ముకేశ్ 5-1-26-1; కుల్దీప్ 15-0-60-1; అశ్విన్ 18-2-72-3; అక్షర్ 14-1-75-1.

## ప్రసాద్ జోడీకి ఇరాన్ టైటిల్

మిక్స్‌డ్ రన్నరప్‌గా సిక్కి జంట

**హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి):** ఇరాన్ ఫజర్ ఇంటర్నేషనల్ చాలెంజ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో తెలుగు షట్లర్లు సత్తా చాటారు. ఇరాన్‌లోని యాజ్ద్‌లో జరిగిన ఈ పోటీల్లో పురుషుల డబుల్స్‌లో కృష్ణ ప్రసాద్ గరగ-సాయి ప్రతీక్ ద్వయం విజేతగా నిలవగా, మిక్స్‌డ్‌లో సిక్కి-సుమిత్ రెడ్డి జంట రన్నరప్ టైటిల్‌తో సరిపెట్టుకుంది.

## న్యూజెర్సీలో ఫిఫా కప్ ఫైనల్

2026 వరల్డ్‌కప్ షెడ్యూల్ విడుదల

**న్యూయార్క్:** 2026 ఫుట్‌బాల్ వరల్డ్‌కప్ ఫైనల్‌కు న్యూజెర్సీలోని మెట్‌లైఫ్ స్టేడియం వేదిక కానుంది. 20వ ప్రపంచకప్ జరిగే వేదికలు, మ్యాచ్‌ల షెడ్యూల్‌ను ఫిఫా విడుదల చేసింది. అమెరికా, మెక్సికో, కెనడా సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ టోర్నీ 2026 జూన్ 11 నుంచి జూలై 19 వరకు జరగనుంది. జూన్ 11న మెక్సికోలోని అజ్‌టెకా స్టేడియంలో ఆరంభ మ్యాచ్ జరగనుంది.

## డబ్ల్యూటీసీలో రెండో స్థానానికి టీమిండియా

**దుబాయ్:** వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) పట్టికలో భారత్ రెండో స్థానానికి చేరుకుంది. ఇంగ్లండ్‌తో జరిగిన రెండో టెస్టులో ఘనవిజయం సాధించడంతో టీమిండియా 4 స్థానాలు ఎగబాకింది. భారత్ 52.77 పాయింట్ల శాతంతో రెండోస్థానంలో ఉండగా, స్వల్ప తేడా(55.00)తో ఆస్ట్రేలియా టాప్‌లో కొనసాగుతోంది. ఇక, తొలి ఐదు స్థానాల్లో నిలిచిన జట్ల మధ్య 5 శాతం తేడానే ఉండడం విశేషం.

## క్వార్టర్స్‌లో నిఖత్

లవ్లీనాపై అనర్హత వేటు
స్ట్రాంజా బాక్సింగ్

**బల్గేరియా:** స్ట్రాంజా ఇంటర్నేషనల్ బాక్సింగ్ టోర్నమెంట్‌లో తెలంగాణ స్టార్ బాక్సర్, డిఫెండింగ్ చాంపియన్ నిఖత్ జరీన్ క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. సోమవారం జరిగిన 50 కిలోల విభాగంలో నిఖత్ 3-2తో ఒయున్‌సెట్సెగ్ యెసుజెన్ (మంగోలియా)పై నెగ్గింది. ఇదే టోర్నీలో 75 కిలోల విభాగంలో పోటీపడ్డ టోక్యో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత లవ్లీనా అనూహ్యంగా అనర్హత వేటుకు గురైంది. ఐర్లాండ్ బాక్సర్ రౌర్కీ అయోఫితో జరిగిన ఆరంభ బౌట్‌లో మూడో రౌండ్‌లో ఇద్దరి మధ్య తీవ్రమైన పెనుగులాట జరగగా, మూడు హెచ్చరికల అనంతరం లవ్లీనాను రెఫరీ డిస్‌క్వాలిఫైగా ప్రకటించాడు.

## రచిన్ 'డబుల్'

- కివీస్ తొలి ఇన్నింగ్స్ 511
- దక్షిణాఫ్రికా 80/4



**మౌంట్‌మాంగనుయ్:** రచిన్ రవీంద్ర (240) ద్విశతకంతో చెలరేగిన వేళ..దక్షిణాఫ్రికాతో తొలి టెస్టు మొదటి ఇన్నింగ్స్‌లో న్యూజిలాండ్ భారీస్కోరు చేసింది. ఓవర్‌నైట్ స్కోరు 258/2తో సోమవారం ఆట కొనసాగించిన కివీస్ 511 పరుగులకు ఆలౌటైంది. కిందటి రోజు 112 పరుగులతో ఆడుతున్న కేన్ విలియమ్సన్ తన స్కోరుకు మరో 6 రన్స్ జోడించి అవుటవగా..118తో నాటౌట్‌గా ఉన్న రచిన్ దానిని 'డబుల్'గా మలచి 240 పరుగుల వద్ద నిష్క్రమించాడు. ఇక..తొలి ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా రెండోరోజు ఆఖరికి 80/4 స్కోరుకే పరిమితమై తీవ్ర ఇక్కట్లలో పడింది. కివీస్ తొలి ఇన్నింగ్స్ స్కోరుకు సఫారీ జట్టు 431 రన్స్ వెనుకంజలో నిలిచింది.



## ఖేలో ఇండియాలో తెలంగాణకు 3 పతకాలు

**హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి):** లదాఖ్‌లో జరుగుతున్న ఖేలో ఇండియా వింటర్ గేమ్స్‌లో తెలంగాణకు మూడు పతకాలు లభించాయి. ఐస్ స్పీడ్ స్కేటింగ్ బాలికల అండర్-17 షార్ట్‌ట్రాక్ 300 మీటర్లు, 500 మీటర్ల విభాగాల్లో తాళ్లూరి నయనశ్రీ స్వర్ణాలు సాధించింది. బాలుర అండర్-17 షార్ట్ ట్రాక్ 500 మీటర్ల కేటగిరీలో సూరపనేని ప్రణవ్ మాధవ్ రజతం సాధించాడు.

## అఫ్ఘాన్‌పై లంక విజయం

**కొలంబో:** అఫ్ఘానిస్థాన్‌తో ఏకైక టెస్టులో శ్రీలంక పది వికెట్లతో ఘన విజయం సాధించింది. ఓవర్‌నైట్ స్కోరు 199/1తో సోమవారం, నాలుగో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన అఫ్ఘాన్ 296 పరుగులకు ఆలౌటైంది. స్పిన్నర్ జయసూర్య ఐదు వికెట్లతో ప్రత్యర్థిని వణికించాడు. ఇక.. 56 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని వికెట్ కోల్పోకుండా లంక ఛేదించింది. తొలి ఇన్నింగ్స్‌లో అఫ్ఘాన్ 198, శ్రీలంక 439 పరుగులు చేశాయి.

# బిజినెస్

## లాభాల స్వీకారంతో నష్టాలు

ముంబై: స్టాక్‌మార్కెట్ సోమవారం నష్టాలతో ముగిసింది. ఆటుపోట్లతో సాగిన ట్రేడింగ్‌లో చివరి గంటలో లాభాల స్వీకరణ అమ్మకాలు హోరెత్తాయి. దీంతో సెన్సెక్స్ 354.21 పాయింట్ల నష్టంతో 71,731.42 వద్ద, నిఫ్టీ 82.10 పాయింట్ల నష్టంతో 21,771.70 వద్ద క్లోజయ్యాయి.

**రూ.1,000 పైకి ఎల్ఐసీ షేరు:** ఎల్ఐసీ షేర్లలో సోమవారం మంచి కదలిక కనిపించింది. బీఎస్ఈలో ఈ షేర్లు 5.90 శాతం లాభంతో రూ.1,000.35 వద్ద ముగిశాయి. దీంతో ఎల్ఐసీ మార్కెట్ క్యాప్ సోమవారం ఒక్క రోజే రూ.35,230.25 కోట్లు పెరిగి రూ.6,32,721.15 కోట్లకు చేరింది. ఇంట్రాడేలో ఒక దశలో ఎల్ఐసీ షేర్లు 8.81 శాతం లాభంతో రూ.1,027.95కు చేరి 52 వారాల గరిష్ఠ స్థాయిని తాకాయి. లిస్టింగ్ తర్వాత మదుపరులకు చుక్కలు చూపించిన ఎల్ఐసీ షేర్లు రూ.1,000 మార్క్‌ను అధిగమించడం ఇదే మొదటిసారి.

**'హ్యుండయ్' నుంచి రూ.46,513 కోట్ల ఐపీఓ!:** హ్యుండయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ (హెచ్ఎంఐఎల్) భారీ ఐపీఓకు సిద్ధమవుతోంది. కంపెనీ ఈ ఏడాది చివర్లో 330 నుంచి 560 కోట్ల డాలర్ల (సుమారు రూ.27,409 కోట్ల నుంచి రూ.46,513 కోట్లు) సమీకరణ కోసం ఐపీఓకు వస్తుందని సమాచారం. ఇదే జరిగితే భారత ఐపీఓ మార్కెట్‌లో ఇదే అతి పెద్ద ఐపీఓ అవుతుంది. అయితే ఈ వార్తలపై హుండయ్ మోటార్ ఇండియా అధికారికంగా నోరు మెదపడం లేదు.

## కీయస్ స్మార్ట్ హోమ్‌కు రూ.100 కోట్ల ఫండింగ్

హైదరాబాద్: నగరానికి చెందిన స్మార్ట్ హోమ్ ఆటోమేషన్ స్టార్టప్ కీయస్ స్మార్ట్ హోమ్‌కు రూ.100 కోట్ల ఫండింగ్ లభించింది. ప్రైవేట్ ఈక్విటీ సంస్థ ఓఏకేఎస్ అసెట్ మేనేజ్‌మెంట్ సహా ఇతరుల నుంచి ఈ నిధులను సమీకరించింది. ఢిల్లీ-ఎన్‌సీఆర్, బెంగళూరు, పుణె, ముంబై వంటి ప్రధాన నగరాల్లో ఎక్స్‌పీరియెన్స్ సెంటర్ల ఏర్పాటుతో పాటు హైదరాబాద్ మార్కెట్లో అగ్రగామి స్మార్ట్ హోమ్ ఆటోమేషన్ ప్లేయర్‌గా ఎదిగేందుకు, ప్రథమ, ద్వితీయ శ్రేణి నగరాల్లోకి విస్తరించేందుకు ఈ నిధులను వినియోగించనున్నట్లు కంపెనీ తెలిపింది.

# అంబానీ చేతికి పేటీఎం వాలెట్!






## రేసులో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సైతం..

న్యూఢిల్లీ: పేటీఎం మాతృసంస్థ వన్97 కమ్యూనికేషన్స్ లిమిటెడ్ తన వాలెట్ బిజినెస్‌ను విక్రయించేందుకు ముకేశ్ అంబానీకి చెందిన జియో ఫైనాన్షియల్ సర్వీసెస్‌తో పాటు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌తో చర్చలు జరుపుతున్నట్లు తెలిసింది. పేటీఎం వాలెట్ సేవలు.. ఆర్‌బీఐ నిషేధం విధించిన పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ పరిధిలోకే వస్తాయి. పేటీఎం మేనేజ్‌మెంట్ గత నవంబరు నుంచే జియో ఫైనాన్షియల్‌తో చర్చలు జరుపుతున్నదని, హెచ్‌డీఎఫ్‌సీతో చర్చలు ఆర్‌బీఐ నిషేధానికి కొన్ని రోజుల ముందే ప్రారంభించినట్లు సమాచారం. కాగా, అంబానీకి చెందిన ఈ నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ (ఎన్‌బీఎఫ్‌సీ).. పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌ను మొత్తంగా కొనుగోలు చేసేందుకు ఆసక్తిగా ఉన్నట్లు ఇండస్ట్రీ వర్గాలు పేర్కొన్నాయి. హెచ్‌డీఎఫ్‌సీకి చెందిన డిజిటల్ వాలెట్ పేజాప్‌కు ఇప్పటికే 1.4 కోట్ల మంది కస్టమర్లున్నారు. పేటీఎం వాలెట్‌ను దక్కించుకోగలిగితే ఈ సెగ్మెంట్లో అగ్రగామి కంపెనీ కాగలదు. ప్రస్తుతానికి ఈ సేవల్లో అంతగా ప్రభావం చూపలేకపోయిన జియో ఫైనాన్షియల్స్‌కు పేటీఎంతో డీల్ బాగా కలిసిరావచ్చని ఇండస్ట్రీ వర్గాలన్నాయి.

ఫిబ్రవరి 29 తరువాత నుంచి పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ లిమిటెడ్ (పీపీబీఎల్) డిపాజిట్లు స్వీకరించకుండా గతవారం ఆర్‌బీఐ ఆంక్షలు విధించింది. కస్టమర్ల సేవింగ్, కరెంట్ అకౌంట్లతో పాటు ప్రీ-పెయిడ్ సాధనాలైన వాలెట్లు, నేషనల్ కామన్ మొబిలిటీ కార్డ్‌లు(ఎన్‌సీఎంసీ) ఫాస్టాగ్ అకౌంట్లలోకి డిపాజిట్లు లేదా టాప్-అప్‌లను స్వీకరించవద్దని బ్యాంక్‌ను ఆదేశించింది. అయితే, అకౌంట్లలోకి వడ్డీ, కాష్‌బ్యాక్ లేదా రిఫండ్ సొమ్మును మాత్రం జమచేయవచ్చని స్పష్టం చేసింది. అంతేకాదు, కస్టమర్లు తమ అకౌంట్‌లో ఉన్న నగదును ఉన్నంతవరకు వినియోగించుకునేందుకు, ఉపసంహరించుకునేందుకూ ఎలాంటి ఆంక్షలుండవని తెలిపింది. ఇవి తప్ప మార్చి 1 నుంచి ఐఎంపీఎస్, ఏఈపీఎస్ వంటి నగదు బదిలీ లావాదేవీలు, భారత్ బిల్ పేమెంట్ లావాదేవీలు, యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) సేవలను అందించడానికి వీల్లేదని పీపీబీఎల్‌ను ఆదేశించింది. దీంతో ఈ నెలాఖరు నుంచి పీపీబీఎల్ సేవలు దాదాపుగా నిలిచిపోనున్నాయి. 2022 మార్చిలోనే పీపీబీఎల్ కొత్త కస్టమర్లను చేర్చుకోకుండా ఆర్‌బీఐ ఆంక్షలు విధించింది. పీపీబీఎల్ లైసెన్సును వచ్చే నెలలో రద్దు చేసే దిశగా ఆర్‌బీఐ యోచిస్తున్నదని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. తొలుత డిపాజిటర్ల సొమ్ముకు రక్షణ కల్పించాక బ్యాంక్‌పై వేటు వేయవచ్చన్నారు. కాగా, పీపీబీఎల్‌లో మనీలాండరింగ్ జరిగినట్లు ఆర్‌బీఐ గుర్తిస్తే, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దర్యాప్తు చేస్తుందని రెవెన్యూ కార్యదర్శి సంజయ్ మల్హోత్రా అన్నారు.

**పేటీఎం షేరు మరో 10 శాతం డౌన్**

పేటీఎం బ్రాండ్ యాజమాన్య సంస్థ వన్ 97 కమ్యూనికేషన్స్ లిమిటెడ్ షేరు వరుసగా మూడో రోజూ లోయర్ సర్క్యూట్‌ను తాకింది. సోమవారం బీఎస్ఈలో ఈ షేరు ధర మరో 10 శాతం క్షీణించి రూ.438.35 వద్దకు పతనమైంది. గత మూడు ట్రేడింగ్ సెషన్లలో ఈ షేరు 42 శాతం క్షీణించింది. ఫలితంగా కంపెనీ మార్కెట్ విలువ (క్యాపిటలైజేషన్) రూ.20,471.25 కోట్లు తగ్గి రూ.27,838 కోట్ల స్థాయికి జారుకుంది.

### పీపీబీఎల్ కస్టమర్లకు ప్రత్యామ్నాయాలు..

**ఆ**ర్‌బీఐ నిషేధం నేపథ్యంలో పీపీబీఎల్ కస్టమర్లు తమ ఖాతాలోని సొమ్మును యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ), ఇమ్మీడియేట్ పేమెంట్ సర్వీస్ (ఐఎంపీఎస్), రియల్ టైం గ్రాస్ సెటిల్‌మెంట్ (ఆర్‌టీజీఎస్) ద్వారా ఇతర అకౌంట్లోకి బదిలీ చేసుకోవచ్చు. కానీ, మీ పీపీబీఎల్ అకౌంట్లోకి మాత్రం మార్చి ఒకటి నుంచి సొమ్ము జమ చేయలేరు. పేటీఎం వాలెట్‌లోని సొమ్మును కూడా ఇతర అకౌంట్లోకి ట్రాన్స్‌ఫర్ చేసుకోవచ్చు. అయితే, పేటీఎం వాలెట్‌పై ఒక లావాదేవీ ద్వారా గరిష్ఠంగా రూ.25,000, రోజుకు గరిష్ఠంగా రూ.లక్ష బదిలీ చేసుకోగలుగుతారు. అయితే, ఇందుకు 3 శాతం లావాదేవీ రుసుము చెల్లించాల్సి ఉంటుంది. ఉదాహరణకు రూ.25,000 బదిలీకి రూ.750 రుసుము చెల్లించాలి. పీపీబీఎల్ వాలెట్, ఫాస్టాగ్, ఎన్‌సీఎంసీ సేవలను ఇతర బ్యాంక్‌లకు బదిలీ చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు బ్యాంక్ ఇప్పటికే వెల్లడించింది.

పీపీబీఎల్‌కు ప్రత్యామ్నాయంగా ఇతర సంస్థల వాలెట్, ఫాస్టాగ్ సేవలకు మారవచ్చు. దేశంలో 20కి పైగా బ్యాంకింగ్, ఎన్‌బీఎఫ్‌సీలు వాలెట్ సేవలందిస్తున్నాయి. మొబీక్విక్, ఫోన్‌పే, ఎస్‌బీఐ, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, అమెజాన్ పే అందులో కొన్ని. అలాగే, ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, ఐడీఎఫ్‌సీ, ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ వంటి 37 ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బ్యాంక్‌లు ఫాస్టాగ్ సేవలందిస్తున్నాయి. కస్టమర్లు తమ ఫాస్టాగ్‌ను మొబైల్ బ్యాంకింగ్, ఆన్‌లైన్ బ్యాంకింగ్ లేదా గూగుల్ పే, ఫోన్‌పే వంటి థర్డ్ పార్టీ యాప్‌ల ద్వారా ఆన్‌లైన్‌లో రీచార్జ్ చేసుకునే వీలుంటుంది.

ఆర్‌బీఐ ఆదేశాలతో తమ రుణ, బీమా పంపిణీ, ఈక్విటీ బ్రోకింగ్ వ్యాపారాలకు పీపీబీఎల్‌తో సంబంధం లేదు కాబట్టి వాటిపై ఎలాంటి ప్రభావం ఉండదని పేటీఎం ఇప్పటికే స్పష్టం చేసింది. అంతేకాదు, కంపెనీకి చెందిన ఆఫ్‌లైన్ మర్చంట్ పేమెంట్ నెట్‌వర్కింగ్ సేవలైన పేటీఎం క్యూఆర్, పేటీఎం సౌండ్‌బాక్స్, పేటీఎం కార్డ్ మెషీన్ యధాతథంగా కొనసాగనున్నాయి. ఈ సేవల్లో కొత్త కస్టమర్లను చేర్చుకునేందుకు ఎలాంటి ఆంక్షల్లేవని పేటీఎం వెల్లడించింది.



| బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో) | 24 క్యారెట్లు | 22 క్యారెట్లు | కేజీ వెండి |
|---|---|---|---|
| హైదరాబాద్ | 63,220 ▼ | 57,950 ▼ | 76,700 ▼ |
| ముంబై | 62,510 ▼ | 57,260 ▼ | 70,420 ▼ |

**ఫారం గేటు అమ్మకం ధరలు** (నెక్ 100 గుడ్లు)



| | |
|---|---|
| **5వ తేదీ** | |
| హైదరాబాద్ | 540 |
| **6వ తేదీ** | |
| చిత్తూరు | 583 |
| గోదావరి | 543 |
| విజయవాడ | 543 |
| విశాఖపట్నం | 555 |
| వరంగల్ | 542 |

డజను గుడ్లు రూ.72

**ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 111 | విజయవాడ | 113 |
| వరంగల్ | 111 | గుంటూరు | 117 |
| కరీంనగర్ | 111 | ఒంగోలు | 117 |
| మహబూబ్‌నగర్ | 111 | చిత్తూరు | 123 |
| కర్నూలు | 111 | నెల్లూరు | 123 |
| విశాఖపట్నం | 107 | అనంతపురం | 113 |
| గోదావరి | 113 | | |

## ఎల్ఐసీ కొత్త ప్లాన్ ఇండెక్స్ ప్లస్

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ) ఇండెక్స్ ప్లస్ పేరిట వ్యక్తిగత జీవిత బీమా ప్లాన్‌ను విడుదల చేసింది. ఇది యూనిట్ లింక్డ్, రెగ్యులర్ ప్రీమియం పాలసీ. ఇది అమలులో ఉన్న కాలం అంతా జీవితబీమా కవరేజితో పాటుగా పొదుపు అవకాశం కూడా కల్పించే పాలసీ అని ఎల్ఐసీ ఒక ప్రకటనలో తెలిపింది. నిర్దిష్ట గడువు ముగిసిన అనంతరం వార్షికంగా చెల్లించే ప్రీమియంలో కొంత శాతాన్ని గ్యారంటీ జోడింపుగా యూనిట్ ఫండ్‌కు జమ చేస్తారు. ఈ సొమ్మును యూనిట్లు కొనుగోలు చేసేందుకు వినియోగించవచ్చు. ఐదు సంవత్సరాల లాకిన్ గడువు ముగిసిన అనంతరం ఆ యూనిట్లను పాక్షికంగా ఉపసంహరించుకునే అవకాశం కూడా కల్పిస్తారు.

**ప్లాన్ ముఖ్యాంశాలు...**

- ప్లాన్‌లో చేరేందుకు కనీస వయసు 90 రోజులు. గరిష్ఠ వయో పరిమితి హామీ మొత్తం ఆధారంగా 50 లేదా 60 సంవత్సరాలు.
- కనీస హామీ మొత్తం వార్షిక ప్రీమియంకు 7 నుంచి 10 రెట్లు.
- మెచ్యూరిటీకి కనీస వయసు 18 సంవత్సరాలు కాగా గరిష్ఠ వయసు 75 లేదా 85 సంవత్సరాలు.
- కనీస కాలపరిమితి 10 లేదా 15 సంవత్సరాలు.
- కనీస ప్రీమియం రూ.30000 (ఏడాదికి), రూ.15000 (అర్ధసంవత్సరానికి), రూ.7500 (త్రైమాసికానికి), రూ.2500 (నెలవారీగా)
- ఎన్ఎస్ఈ 100 ఇండెక్స్ లేదా ఎన్ఎస్ఈ నిఫ్టీ 50 ఇండెక్స్‌లలోని ఎంపిక చేసిన షేర్లలో పెట్టుబడులు పెట్టే ఫ్లెక్సి గ్రోత్ ఫండ్ లేదా ఫెక్సి స్మార్ట్ గ్రోత్ ఫండ్‌లో ఏదైనా ఎంచుకునే అవకాశం
- మెచ్యూరిటీ సమయానికి పాలసీదారుడు జీవించి ఉన్నట్టయితే యూనిట్ ఫండ్ విలువతో సమానమైన మొత్తం చెల్లిస్తారు.

## యూనియన్ బ్యాంక్‌కు పీసీఐ పిన్ సర్టిఫికేషన్



హైదరాబాద్: ప్రభుత్వ రంగంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పేమెంట్ కార్డు పరిశ్రమ పిన్ లావాదేవీ భద్రత (పీసీఐ పిన్) సర్టిఫికేషన్‌ను సాధించింది. బ్యాంక్ వ్యవస్థల ద్వారా నిర్వహించే అన్ని రకాల లావాదేవీల గోప్యత, సమగ్రత సంరక్షణ విషయంలో పరిశ్రమ అగ్రశ్రేణి ప్రమాణాలకు దీటుగా పటిష్ఠమైన భద్రత కల్పిస్తున్నందుకు ఇది గుర్తింపు అని బ్యాంక్ తెలిపింది. రోజురోజుకీ పెరుగుతున్న పలు ముప్పులను నిరోధించేందుకు నిరంతరాయంగా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టడం ద్వారా కస్టమర్ల విశ్వాసం పొందడం బ్యాంకు లక్ష్యమని పేర్కొంది.

## అరబిందో అనుబంధ సంస్థ విక్రయం

హైదరాబాద్: నష్టాల్లో ఉన్న అమెరికాలోని తన అనుబంధ కంపెనీ 'యుజియా యూఎస్ మాన్యుఫ్యాక్చరింగ్ ఎల్ఎల్‌సీని అరబిందో ఫార్మా విక్రయించింది. ఈ కంపెనీ వ్యాపార ఆస్తులు, అప్పులు, ఉద్యోగులతో కలిపి ఎంపవర్ క్లినిక్ సర్వీస్ న్యూజెర్సీ అనే కంపెనీకి 5.2 కోట్ల డాలర్లకు (సుమారు రూ.432 కోట్లు) విక్రయించింది. దీనికి తోడు 'యుజియా యూఎస్ మాన్యుఫ్యాక్చరింగ్ ఎల్ఎల్‌సీ, దాని అనుబంధ సంస్థల ఉత్పత్తి యూనిట్లను 20 సంవత్సరాల పాటు లీజుకు ఇవ్వడం ద్వారా మరో 5.8 కోట్ల డాలర్లు (సుమారు రూ.482 కోట్లు) అరబిందో ఫార్మాకు లభిస్తాయి.

## ఎయిర్‌టెల్ లాభం రూ.2,442.2 కోట్లు

న్యూఢిల్లీ: భారతీ ఎయిర్‌టెల్ మూడో త్రైమాసికానికి మంచి ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. కంపెనీ ఈ కాలానికి రూ.37,899.5 కోట్ల ఆదాయంపై రూ.2,442.2 కోట్ల నికర లాభం ఆర్జించింది. 2022 డిసెంబరు త్రైమాసికంతో పోలిస్తే ఆదాయం 5.8 శాతం, నికర లాభం 54 శాతం పెరిగాయి.

**చార్జీల దరువు తప్పదు:** ఒక్కో ఖాతాదారుడి నుంచి లభించే సగటు ఆదాయం (ఏఆర్‌పీయూ) 7.7 శాతం పెరిగి రూ.208కి చేరింది. అయితే ఇది ఏ మాత్రం గిట్టుబాటు కాదని, చార్జీలు మరింత పెంచక తప్పదని కంపెనీ ఎండీ గోపాల్ విఠల్ ఈ సందర్భంగా చెప్పారు.